# చేదు నిజం

**రాచపూడి రమేష్**



పీక్ అవర్ లోని ట్రాఫిక్ వంశీ మనసులోని సంఘర్షణలా గజిబిజిగా వుంది. సన్నగా వర్షం పడుతుండడంతో వైపర్స్ ఆన్ చేశాడు వంశీ. మనసులోని టెన్షన్నును అదుపులో పెట్టుకుని ఎంతో ఏకాగ్రతతో ఆ బిజీ రోడ్డుపై కారు డ్రైవ్ చేయాల్సి వస్తోంది. ఎంత వద్దనుకున్నా భార్య సుమతో వారం రోజుల్నుంచీ పడుతున్న ఘర్షణ అతనికి చికాకు కలిగిస్తోంది.

తన తండ్రి రాఘవరావు జబ్బు మనిషైనా ఆయన పనులు ఆయన నిక్షేపంగా చేసుకుపోతున్నారు. ఐనా ఆయన ఉనికి సుమకు కంటకంగా మారింది.

''ఎంతకాలం మనమీ భారాన్ని మోయాలి? భార్య చనిపోయి మూడేళ్ళవుతున్నా, ఈ పెద్దాయన శనిగ్రహంలా ఈ ఇంట్లోనే దాపురించాడు. ఆయన బట్టలు ఉతకలేక, ఉప్పు, కారంలేని ఆయనకు నచ్చే వంటకాలు చేయలేక చచ్చిసున్నమౌతున్నాను. రాత్రుళ్ళు ఆయన దగ్గుతో నాకు నిద్రపట్టడం లేదు. ఊర్లో ఇన్ని ఆశ్రమాలున్నాయి, ఓల్డ్ ఏజ్, హోములున్నాయి. వేటిలోనో ఆయన హాయిగా 'కృష్ణారామా' అనుకుంటూ వుండిపోవచ్చు గదా. ఏమి పీడ దాపురించిందిరా నాయనా'' అని చీదరించుకునేది.

రానురాను తండ్రి ఎదురుగానే ఆమె సణుగుడు తీవ్రతరమవడంతో, వంశీ ఇరకాటంలో పడ్డాడు. తాను ఏమి నచ్చజెప్పబోయినా నోటిదురుసు మనిషైన భార్య ఇంతెత్తునలేచి నోరు పారేసుకుంటూ వుండడంతో 'కుడితిలో పడ్డ ఎలుకలా' వుంది అతని పరిస్థితి.

'పేరుకు తను పెద్ద ఆఫీసరు', కానీ స్తోమతుకు మించిన చదువులు చెప్పి ఇంతవాణ్ణి చేసిన తండ్రికి తగిన న్యాయం చేయలేకపోతున్నానన్న వేదన అతణ్ణి బాధిస్తోంది. రోజూ ఆఫీసులోనే తనకు రాత్రి పదిగంటల వరకూ పని సరిపోతుంది. భార్య పుట్టినరోజు కాబట్టి ఈ రోజు ఆరింటికే ఫైళ్ళన్ని కట్టిపెట్టి ఇంటికి బయల్దేరాడు. 'రోజూ తాను ఇల్లు చేరుకొనే వరకు తన భార్య




పెట్టే సణుగుడును' తండ్రి ఎలా భరిస్తున్నాడో అని పించిందతనికి.

కారును ఫ్లవర్స్ బొకే షాపు ముందు ఆపాడు వంశీ. పార్కింగ్ లాట్‌లో కారును పార్క్ చేసి షాపు వేపు నడిచాడు. రంగురంగుల పూలతో రకరకాల షేపుల్లో బొకేలు, దండలు, చాలా ఆకర్షణీయంగా వున్నాయి. షాపు మెట్లపై నిలబడి ఒక ఎనిమిదేళ్ళ పాప అద్దాల్లోంచి పూలవైపు దీక్షగా, ఆశగా చూస్తోంది. ఆమె బట్టలు బాగా నలిగి వున్నాయి.

వంశీ షాపులోకి వెళ్ళి పదినిమిషాలు తరువాత తనకు కావలసిన బొకేను కొనుక్కు వచ్చేసరికి, ఆ పాప ఇంకా షాపు వరండాలోనే తచ్చాడుతూ వుంది. బట్టలు బాగా నలిగి వున్నా, ఆపాప మొఖంలో దైన్యంతో పాటు కళ కూడా కనిపించింద తనికి.

''ఎవరికోసం పాపా చూస్తున్నావు'' అడిగాడ తను చిన్నగా

''ఏమీ లేదులే అంకుల్'' అందాపాప. కానీ వంశీని ఆసక్తి వదల్లేదు. మళ్ళీ మళ్ళీ అడిగాక చెప్పిందా పాప భయపడుతూ.

''ఈ రోజు మా అమ్మ బర్త్‌డే అంకుల్. ఒక గులాబీ కావాలి'' అంది దీనంగా. వంశీ మనసు కరిగింది.

షాపులోకి వెళ్ళి ఒక గులాబీ పువ్వు తీసుకువచ్చి ఆ పాపకిచ్చాడు. ఆ పాప మొఖం వెంటనే విప్పారింది. 'థాంక్స్' అంకుల్ అని గబగబా మెట్లుదిగి పరుగెత్తబోయింది.

'భార్య పుట్టిన రోజు ఒక మంచి పనైనా చేద్దాం' అనిపించింది వంశీకి. ఆ పాప చెయ్యి పట్టుకుని ఆపి ''ఉండుపాప, కార్లో నిన్ను మీ ఇంటి దగ్గర దింపేస్తాను'' అన్నాడు.

ఆ పాప ముందు తటపటాయించినా, కారెక్కి వంశీ పక్కసీట్లో కూర్చుంది చివరకు. మెత్తని సీట్లో కూర్చుని బయట కదుల్తున్న వాహనాలను, మనుషులను కారు విండోలోంచి చూడడం గమ్మత్తుగా వుందా పాపకు.

జనసమర్థం దాటి కారు ఒక కాలేజి ముందు వెళ్తుండగా హఠాత్తుగా కారాపమందా పాప. డోరు తీసుకోవడానికి కష్టపడుతుండడంతో 'ఇక్కడకు దగ్గరేనా మీ ఇల్లు' అంటూ కారు డోరు తీశాడు వంశీ. 'థాంక్స్ అంకుల్' అని వెంటనే పరుగెత్తిందా

''ఏడాది క్రితం మా అమ్మ చనిపోయిందంకుల్. మా నాన్న అమ్మను మరచిపోయాడు. మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు'' అంది కన్నీళ్ళతో. వంశీకి తల తిరిగినట్లైంది.

పాప. ఆశ్చర్యపోతూ వంశీ ఆ పాప వెనుక నడిచాడు. ఎదురుగా వున్న ఇనుపగేటు తీసుకొని లోనికి పరుగెత్తిందా పాప. చిన్న సైజు పూల తోటలా వున్న ఆ కాంపౌండ్‌లో నాలుగైదు సమాధులున్నాయి. ఒక సమాధి ముందు చేరగిలబడిన ఆ పాప సమధిపై పువ్వుంచి నమస్కరిస్తూ వుండడంతో అప్రతిభుడయ్యాడు వంశీ. చిన్నగా ఆ పాప భుజంపై చేయి వేశాడు.

తల ఎత్తిన ఆ పాప కంటి నిండా నీళ్ళు. గద్గదికంగా కాసేపు ఏమీ మాట్లాడలేకపోయింది.

''ఏడాది క్రితం మా అమ్మ చనిపోయిందంకుల్. మా నాన్న అమ్మను మరచిపోయాడు. మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు'' అంది కన్నీళ్ళతో. వంశీకి తల తిరిగినట్లైంది. చిన్నగా కూడదీసుకొని బయటకు నడిచాడు.

అప్రయత్నంగా కార్లో కూర్చుని స్టార్ట్ చేశాడు. మనసంతా కలచివేసినట్లైంది.

అతను ఇంటికి చేరుకొనేసరికి, తండ్రి సంచి సర్దుకొని సిద్ధంగా వున్నాడు. ఆశ్చర్యంగా చూశాడు వంశీ.

''నాకిక్కడ ఏమీ తోచడం లేదురా, నాకు తెలిసిన ఆశ్రమ మొకటి వుంది. కొన్నాళ్ళక్కడ గడిపి రావాలనుకుంటున్నా'' అన్నాడాయన.

''ఎందుకు నాన్నా...'' అని వంశీ ఏదో అనబోయేలోగా సుమ అతణ్ణి జబ్బ పట్టుకొని పక్కగదిలోకి తీసికెళ్ళింది.

''మీ నాన్న తనంతట తాను వెళ్తానంటుంటే ఆపుతారెందుకు? మీకేమైనా పిచ్చా? వెళ్ళనీండి'' అంది కోపంగా.

భార్య మాటలకు మౌనంగా తలూపాడు వంశీ, బొకేని ఆమెకందించి, ''మీరేవెళ్ళి ఆశ్రమంలో మీ నాన్నను దింపేసి రండి'' అంది.

''మరి నీ బర్త్‌డే సెలబ్రేషన్స్'' అనుమానంగా అడిగాడు వంశీ.

మరేం ఫర్వాలేదు. ముందీ పీడ విరగడవడం ముఖ్యం'' కోపంగా అందిసుమ.

బస్సులో వెళ్తానన్న రాఘవరావును ఆపి, బలవంతంగా వూరికి పదిమైళ్ళ దూరంలోవున్న ఆశ్రమానికి తీసుకెళ్ళాడు వంశీ.

''అది ఏదో స్వాములవారి ఆశ్రమమనుకున్నాడు కానీ 'శ్రీకృష్ణ అనాధాశ్రమం' అన్న బోర్డు చూసి అవాక్కయాడు'' మౌనంగా తండ్రి వెంట నడిచాడు.

''ఇక్కడెంత కట్టాలన్నా డబ్బు కట్టేస్తాను, ఫర్లేదు'' అన్న వంశీ మాటలకు నవ్వి, ''ఫర్లేదు లేరా, ఆ మాత్రం నేను మేనేజ్ చేస్తాను. నా పి.ఎఫ్ డబ్బుంది కదా, మెస్, మెయింటెనెన్స్‌కు ఖర్చులు నా నెలవారి పెన్షన్ డబ్బుతో వెళ్ళిపోతాయి'' అన్నాడు రాఘవరావు.

''మేనేజర్'' అన్న బోర్డున్న గది బయట నిలబడి ''ఇక నువెళ్ళిరారా'' అన్న తండ్రి మాటవిని మౌనంగా వెనక్కు నడిచాడు వంశీ. ఇంతలో కారు తాళం చెవులు రిసెప్షన్‌లో మరచి పోయినట్లు చూసుకొని మళ్ళీ తిరిగి వచ్చాడు. రిసెప్షన్ పక్కనే వున్న మేనేజర్ గదిలోంచి మాటలు వినిపిస్తున్నాయి.

''సార్, మిమ్మల్నెక్కడో చూసినట్లుంది'' అంటున్నాడు మేనేజర్.

''చూసుండొచ్చు'' తండ్రి గొంతు.

''గుర్తొచ్చింది పాతికేళ్ళ క్రితం మీరొక మూడేళ్ళ బాబును ''పెంపకానికి'' తీసుకెళ్ళారు గదా మీకు పిల్లలు లేరని. ఇప్పుడా బాబు ఎలా వున్నాడు?''

''బావున్నాడు. నన్నిక్కడ దింపింది వాడే'' తండ్రి గొంతు.

వంశీ కాళ్ళకింద భూమి కదిలినట్లైంది. గబగబాలోనికి వెళ్ళి ''నన్ను క్షమించు నాన్నా'' అని తండ్రి పాదాలపై వాలిపోయాడు.

